సాక్షి శ్రీకాకుళం

గురువారం । 21 । మార్చి । 2024



వణికించిన వాన

జిల్లాలో పలుచోట్ల భారీ వర్షం కురిసింది. రోడ్లు జలమయమయ్యాయి. పంటలకు నష్టం వాటిల్లింది. - 8లో



మార్చురీకని తీసుకెళ్లి..

ఓ వృద్ధుడు మృత్యువు అంచుల వరకు వెళ్లి బతికొచ్చాడు. రైలుపట్టాలపై అచేతనంగా ఉన్న వృద్ధుడికి వైద్యులు ప్రాణం పోశారు. - 8లో



న్యూస్‌రీల్

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు

శ్రీకాకుళం న్యూకాలనీ : జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సాఫీగా సాగుతున్నాయి. 145 కేంద్రాల్లో అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా జరుగుతున్న ఈ పరీక్షల్లో మూడో రోజు బుధవారం ఇంగ్లీషు (థర్డ్ లాంగ్వేజ్) పరీక్షకు విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు కొనసాగిన ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 29058 మందికి గాను 28652 మంది హాజరయ్యారు. 406 మంది గైర్హాజరయ్యారు. 14 మంది సిటింగ్ స్క్వాడ్‌లు 14 కేంద్రాల్లో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. 7 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 32 కేంద్రాల్లో విస్తృతంగా తనిఖీలు చేశారు. మూడో రోజు ఎలాంటి మాల్‌ప్రాక్టీసులు నమోదుకాలేదని డీఈవో వెంకటేశ్వరరావు తెలిపారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి



తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలసిన మధుకేశ్వరునికి ఫాల్గుణ మాసం శుద్ధ ఏకాదశి సందర్భంగా బుధవారం తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభించి స్వామివారికి ఏకవార అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. పార్వతి పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను చక్కగా అలంకరించి పల్లకిలో ఆశీనులుగా చేసి మంగళవాయిద్యాలు నడుమ తిరువీధి నిర్వహించగా భక్తులు హారతులిచ్చారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీల విజేతకు అభినందనలు



రంజనిని అభినందిస్తున్న వీసీ రజిని

ఎచ్చెర్ల క్యాంపస్: కేంద్ర యువజన, క్రీడా వ్యవహారాల శాఖ జాతీయ యువ పార్లమెంట్ ఫెస్టివల్-2024లో భాగంగా నెహ్రూ యువ జన కేంద్రం ఆధ్వర్యంలో ఇటీవల ఆన్‌లైన్‌లో వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఇందులో 60 మంది విద్యార్థులు పాల్గొనగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని ఏపీజే అబ్దుల్ కలాం ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన సీఎస్ఈ బ్రాంచి విద్యార్థిని బమ్మిడి రంజని విజేతగా నిలిచింది. మేకింగ్ ఇండియా - గ్లోబల్ లీడర్ అంశంపై మాట్లాడి ప్రథమ బహుమతి సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థినిని వీసీ కె.ఆర్.రజిని బుధవారం అభినందించారు. రంజని ఈ ఏడాది ఢిల్లీలో జరిగిన గణతంత్ర పరేడ్‌లో సైతం ఏపీ తరఫున ఎన్ఎస్ఎస్ విభాగంలో ఎంపికైన సంగతి తెలిసిందే.

జాతీయ సెపక్‌తక్రా పోటీలకు ఇద్దరు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో కోచ్ అర్జున్‌రావురెడ్డి


శ్రీకాకుళం న్యూకాలనీ: ఆలిండియా సబ్-జూనియర్స్ బాలబాలికల సెపక్‌తక్రా చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా నుంచి ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. కర్ణాటకలోని దవనగిరి వేదికగా ఈ నెల 26 నుంచి 30 వరకు ఈ పోటీలు జరగనున్నాయి. జిల్లా నుంచి ఎంపికైనవారిలో బాలుర జట్టుకు ప్రధానం చిరంజీవి (9వ తరగతి- టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల), బాలికల జట్టుకు కె.స్వప్న (8వ తరగతి-కళింగపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల) ఉన్నారు. వీరిద్దరూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలబాలికల జట్లకు ప్రాతినిధ్యం వహించనున్నారు. అంతకుముందు నెల్లూరులో జరిగిన రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా చాంపియన్‌షిప్ పోటీల్లో శ్రీకాకుళం బాలుర జట్టు తృతీయ స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. బాలికల జట్టు క్వార్టర్ ఫైనల్స్ వరకు పోరాడింది. జిల్లా జట్లకు ప్రాతినిధ్యం వహించిన చిరంజీవి, స్వప్న మెరుగైన ఆటతీరును కనబర్చడంతో ఏపీ సెపక్‌తక్ర ప్రాబబుల్స్ జట్లకు ఎంపికయ్యారు. వీరు శిక్షణా శిబిరాల కోసం ఉరవకొండ పయనమయ్యారు. అక్కడి నుంచి నేరుగా ఏపీ జట్లతో కలిసి జాతీయ పోటీలకు వెళ్లనున్నారు. వీరిని సెపక్‌తక్రా అసోసియేషన్ జిల్లా చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి అభినందించి ఆర్థిక సాయం అందజేశారు. వీరి ప్రతిభపై సంఘ ఉపాధ్యక్షుడు మురళి, పి.శ్రీకాంత్, శ్రీను, పి.శ్రీనివాస్, కోచ్ గాలి అర్జున్‌రావురెడ్డి, సంఘ ప్రతినిధులు అభినందించారు.

కళా మెడకు చీపురుపల్లి గంట

అటు తిరిగి ఇటు తిరిగి కిమిడి కళా వెంకటరావు పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. చీపురుపల్లి నుంచి పోటీ చేయమని ఆయన్ను పార్టీ సూచించినట్లు సమాచారం. ఎచ్చెర్లలో పార్టీ శ్రేణులు కళాను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో చంద్రబాబు ఈ ప్రతిపాదన చేసినట్లు తెలిసింది. వాస్తవానికి 'కళా'ను చీపురుపల్లి అసెంబ్లీకి పోటీ చేయాలని పార్టీ అధినేత మొదట్లోనే సూచించారు. కానీ 'కళా' అంగీకరించలేదు. విశాఖకు చెందిన గంటా శ్రీనివాసరావును చీపురుపల్లి పంపించి పోటీ చేయించాలని అనుకున్నారు. ఆయన కూడా అంగీకరించకపోవడంతో అక్కడ మంత్రి బొత్సపై పోటీకి సరైన అభ్యర్థి దొరకలేదు. దాంతో మళ్లీ కళా మెడలో గంట కట్టే ప్రయత్నం చేస్తున్నారు. అక్కడ విస్తృత బంధువర్గం, పరిచయాలు ఉన్న సీనియర్ నేత అయిన కళా అయితేనే బొత్సకు కొంత పోటీ ఇవ్వగలరన్నది చంద్రబాబు ఆలోచన. అదే సమయంలో ఎచ్చెర్లలో పంచాయితీని కూడా పరిష్కారం సాధించినట్లు అవుతుందని భావిస్తున్నారు.



- ఎచ్చెర్లలో వ్యతిరేకత నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా ఆలోచిస్తున్న అధిష్టానం
- తాజాగా ఐవీఆర్ఎస్ సర్వే చేసిన పార్టీ
- చీపురుపల్లిలో పోటీ చేయనని ఇప్పటికే స్పష్టం చేసిన గంటా
- రోజురోజుకూ మారుతున్న సమీకరణాలు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ఎచ్చెర్లలో స్వపక్షంలోనే వ్యతిరేకతను ఎదుర్కొంటున్న టీడీపీ నేత కిమిడి కళా వెంకటరావును నియోజకవర్గం మార్చే యోచనలో చంద్రబాబు ఉన్నట్టు తెలుస్తోంది. ఇక్కడ కాకుండా చీపురుపల్లి నియోజకవర్గంలో బరిలో దించితే ఎలా ఉంటుందనేదానిపై ఐవీఆర్ఎస్ సర్వే కూడా చేయించారు. మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావును చీపురుపల్లి నుంచి పోటీ చేయించాలని చూసినా ఆయన ససేమిరా అనడంతో ప్రత్యామ్నాయంగా కళా వెంకటరావుపై దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది. ఐవీఆర్ఎస్ సర్వే ప్రకారం కళాను బరిలో దించుతారా? లేదంటే అక్కడా సానుకూలత లేదని పక్కన పెట్టేస్తారా? అంత రిస్క్ చేయడమెందుకని ఓడిపోయే సీట్లలో ఎవరు పోటీ చేస్తే ఏముందని ఎచ్చెర్లకే వదిలేస్తారా? అన్నది ప్రస్తుతం టీడీపీలోనే చర్చనీయాంశంగా మారింది.

గ్రూపుల గోల..!

ఎచ్చెర్లలో టీడీపీ బలహీనంగా ఉంది. గత ఐదేళ్లలో ఆ పార్టీ ఏమాత్రం బలపడలేదు. సరి కదా గ్రూపులుగా తయారై టీడీపీ శ్రేణులు విడిపోయి మరింత పట్టుకోల్పోయారు. గత ఎన్నికల్లో ఓటమి పాలైన దగ్గరి నుంచి ఇక్కడ వర్గపోరు నడుస్తోంది. మాజీ మంత్రి కిమిడి కళా వెంకటరావు ఒకవైపు, ఏఎంసీ మాజీ చైర్మన్ కలిశెట్టి అప్పలనాయుడు మరోవైపు గ్రూపుగా తయారై రాజకీయాలు చేస్తున్నారు. గుడ్డిలో మెల్ల అన్నట్టుగా ఎవరికి వారు బల ప్రదర్శన చేసుకుంటున్నారు. ఎన్నాళ్లు కళా వెంకటరావు పల్లకిమోస్తామని, ఈ సారి కలిశెట్టికి టికెట్ ఇవ్వాల్సిందేనని కొన్నాళ్లుగా టీడీపీలో ఓ గ్రూపు పట్టుబడుతూ వస్తోంది. చెప్పాలంటే కళా వెంకటరావుకు వ్యతిరేకంగా రాజకీయాలు చేస్తోంది. చౌదరి బాబ్జీ తదితర నాయకులు సైతం కళా వెంకటరావుతో తాము వేగలేమని.. అణగదొక్కే రాజకీయాలు ఇంకెంత కాలమని స్వరం వినిపిస్తున్నారు. అనుకున్నట్టుగా చివరికొచ్చేసరికి కళాతో పోటీగా కలిశెట్టి రేసులో నిలబడ్డారు. ఇప్పుడు ఎవరికి టికెట్ ఇస్తారన్నదానిపై సస్పెన్స్ నెలకొంది.



రకరకాల సర్వేలు..

పొత్తులో భాగంగా బీజేపీకి ఇచ్చేస్తే సమస్యే లేదని ఒకవైపు ఆలోచిస్తుండగానే మరోవైపు కళా, కలిశెట్టిలో ఎవరి బెస్ట్ అన్నదానిపై ఐవీఆర్ఎస్‌తో పాటు రకరకాల సర్వేలను చంద్రబాబు చేయించారు. కొన్నింటిలో కలిశెట్టికి సానుకూలత రాగా, మరికొన్నింటిలో కళాకు అనుకూలంగా వచ్చినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో చీపురుపల్లి నియోజకవర్గం ఆ పార్టీకి గుదిబండగా తయారైంది. మంత్రి బొత్స సత్యనారాయణను ఢీకొట్టే నాయకత్వం అక్కడ లేకపోవడంతో చంద్రబాబు రకరకాల ఆలోచనలు చేస్తున్నారు. తరచూ నియోజకవర్గాలు మార్చి ఎన్నికల్లో గట్టెక్కుతున్న గంటా శ్రీనివాసరావును అక్కడ బరిలో దించాలని చూసింది. పార్టీకి సమస్యగా మారిన గంటాను ఈ రకంగానైనా వదిలించుకోవాలని చంద్రబాబు అండ్‌కో చూస్తోంది. దానిలో భాగంగా ఓడిపోయిన సీట్లలో గంటాను పోటీ చేయిస్తే పీడ విరగడయిపోతుందని భావించారు. కానీ, గంటా దానికి ససేమిరా అంటున్నారు. బొత్సతో పోటీ చేయలేనని చెప్పేస్తున్నారు. ఓడిపోయి పరువు పోగొట్టుకోవడం కంటే పోటీ చేయకపోవడమే మంచిదన్న ఆలోచనకొచ్చి తన మనసులో మాటను అధిష్టానానికి చెప్పేశారు. కాకపోతే, పైరవీలు, లాబీయింగ్ చేసే గంటా తనదైన శైలిలో ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో గంటా పోటీ చేసే సీటుపై ఆ పార్టీ అధిష్టానం పునరాలోచనలో పడింది. ఈ క్రమంలో చీపురుపల్లి నుంచి కిమిడి కళా వెంకటరావును పోటీ చేయిస్తే ఎలా ఉంటుందనేదానిపై ఆలోచన చేస్తోంది. ఇప్పటికే ఐవీఆర్ఎస్ సర్వే కూడా చేయించింది. ఎచ్చెర్లలో ఎలాగూ కష్టం.. చీపురుపల్లిలో కనీసం పోటీ అయినా ఇచ్చి బొత్సతో ఢీకొనాలని చూస్తోంది. అందులో భాగంగానే చీపురుపల్లికి కళా వెంకటరావును పంపిస్తారని ఇప్పటికే ఎచ్చెర్ల నియోజకవర్గ టీడీపీ శ్రేణులకు సమాచారం వచ్చింది. బీజేపీకి ఎచ్చెర్ల ఇచ్చేస్తే.. సీనియర్‌కు కనీసం చీపురుపల్లిలోనైనా సీటు ఇచ్చి గౌరవం ఇచ్చామని చెప్పుకునేలా టీడీపీ అడుగులు వేస్తోంది. ఈ సమీకరణాలు చివరి వరకు నడుస్తాయా? లేదంటే ఆఖరి నిమిషంలో మారుతాయో తెలియదు గానీ ప్రస్తుతం చీపురుపల్లికి కళాను పంపించాలని చంద్రబాబు భావిస్తున్నట్టుగా సమాచారం.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడానికి ప్రతి రాజకీయ పార్టీ సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ కోరారు. సాధారణ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల సన్నద్ధతపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో 38వ వారపు సమీక్ష కలెక్టర్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అన్ని కార్యక్రమాలను నిష్పక్షపాతంగా చేపడుతున్నట్లు చెప్పారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో వివిధ రకాల పర్మిషన్లకు 'సువిధ' యాప్ ద్వారా ఎలా దరఖాస్తు చేసుకోవాలనే విషయంపై ఆయా పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఎక్కడైనా అధికారులు కానీ, పార్టీల ప్రతినిధులు కానీ ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్నట్లు మీ దృష్టికి వస్తే సి.విజిల్ యాప్ ద్వారా గానీ, కమాండ్ కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నంబర్ 1950 ద్వారా గానీ, కాల్ సెంటర్: 18004256625కు గానీ ఫోన్ చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచి ఓటర్ల జాబితాలో తొలగింపులు, మార్పులు ఉండవని, వాటికోసం వచ్చే దరఖాస్తులను మాత్రం పరిశీలిస్తామని తెలిపారు. జాబితాలో కొత్తగా పేర్లు చేర్చడానికి, ఒక చోట నుంచి మరో చోటకు ఓటు బదిలీకి మాత్రం అవకాశం ఉందన్నారు. 85 ఏళ్లు దాటిన వారు జిల్లాలో 11455 మంది, దివ్యాంగ ఓటర్లు 21486 మంది ఉన్నారని, వీరు ఫారం 12డీ సమర్పించడం ద్వారా ఇంటి నుంచే ఓటు వేసేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. సమావేశంలో డీఆర్‌ఓ ఎం.గణపతి రావు, రౌతు శంకరరావు (వైఎస్సార్ సీపీ), పి.ఎం.జె.బాబు (టీడీపీ), సురేష్ సింగ్ (బీజేపీ), డి.గోవిందరావు (సీపీఎం), లాస సోమేశ్వరరావు (బీఎస్పీ) తదితరులు పాల్గొన్నారు.

• నేడు ప్రపంచ కవితా దినోత్సవం



కవితకు పట్టాభిషేకం....

వాల్మీకి రామకథ
పోతన భాగవత సుధ
కవిత్రయం భారతమే ఈ వసుధ
గురజాడ సామాజిక బాధ్యత
శ్రీ శ్రీ విప్లవ కవనం
దాశరథి అభ్యుదయ పథం
చలం స్పృశించిన స్త్రీ భావజాలం
కొడవటిగంటి, కాళీ పట్నం కథల కలశం
దేవులపల్లి భావుకత, సినారె శబ్ద సృజన...
సమాజ ప్రగతికి సోపానాలు
కవిత్వమే సంఘ సంస్కరణకు పునాది
యువత భవితకు నిత్య ఉగాది

కె.వి.రాజారావు, కవి, గురజాడ అవార్డు గ్రహీత, ఆమదాలవలస.

వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు



డాక్టర్ కృష్ణారావును పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి అప్పలరాజు, పేరాడ తిలక్



దువ్వాడ శ్రీనివాస్ సమక్షంలో నీలంపేట పంచాయతీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ మద్దతుదారులు

- పూండిలో టీడీపీకి గుడ్‌బై చెప్పిన డాక్టర్ దున్న కృష్ణారావు
- కోటబొమ్మాళిలోనూ షాక్ ఇచ్చిన పలు కుటుంబాలు

వజ్రపుకొత్తూరు :

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ సెల్ మాజీ కార్యదర్శి, పూండిలో ప్రముఖ వైద్యుడు దున్న కృష్ణారావు బుధవారం వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. పలాసలో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సమక్షంలో ఆయన క్యాంపు కార్యాలయంలో పార్టీలో చేరారు. వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి పేరాడ తిలక్ పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ తెలుగుదేశంలో సామాజిక న్యాయం కొరవడిందని, వలస, వారసత్వ రాజకీయాలను ప్రోత్సహిస్తున్న చంద్రబాబు విధానాలు నచ్చక తాను వైఎస్సార్ సీపీలో చేరినట్లు తెలియజేశారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో అభివృద్ధి, సంక్షేమం వంటి విజన్‌తో ముఖ్యమంత్రి పని చేసిన తీరు నచ్చి పార్టీలోకి చేరినట్లు తెలిపారు. పలాసలో పార్టీ విజయానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాసరావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి తమ్మినేని శాంతారావు, ఎంపీటీసీ ఉపేంద్ర, సర్పంచ్‌లు కొల్లి భాస్కరరావు, కర్ని శ్రీను, నాయకులు రోణంకి శాంతికుమారి, ఇరోతు హేమంతురాజు తదితరులు పాల్గొన్నారు.

• టెక్కలి: ఎమ్మెల్సీ, టెక్కలి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ సమక్షంలో బుధవారం కోటబొమ్మాళి మండలం నుంచి పెద్ద ఎత్తున టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. నీలంపేట పంచాయతీకి చెందిన నీలంపేట, సోమనాథపురం గ్రామాలకు చెందిన టీడీపీ మద్దతుదారులు బొట్ట చిన్నప్పుడు, పిట్ట అప్పయ్య, పల్ల రాజారావు, బుర్లి సూర్యనారాయణ, కొల్లి రాము, బొట్ట అప్పలరాజు, బొమ్మాళి తవిటయ్య, కొర్రాయి చిన్నారావు, వంజరాపు సన్యాసి రావు, మాసాభక్తుల వేణుగోపాల రావు, కొర్రాయి రమణ, బొట్ట కృష్ణారావు, బొడ్డాపు చిన్నారావు, తులా దేవుడు నిరిగిరి బాల, గుమ్మడి రామస్వామి, గుమ్మడి అప్పలస్వామితో పాటు సుమారు వంద కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దుబ్బ వెంకట్రావు, మండల నాయకులు రోణంకి ఉమామల్లయ్య, మండల పార్టీ అధ్యక్షుడు ఎన్. సత్యరాజ్, ఎఎంసీ వైస్ చైర్మన్ బొడ్డు వెంకటరమణ, వాసు, కళ్యాణి, లక్ష్మి, దుక్క రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• అప్పట్లో అభ్యర్థికో ఇనుప పెట్టె

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో నేడు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను వినియోగిస్తున్నారు. ఒకప్పుడైతే అభ్యర్థికో ఇనుప పెట్టెను వాడేవారు. 1952, 1957 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులకు ప్రత్యేకంగా ఇనుప పెట్టెలను బ్యాలెట్ బ్యాక్స్‌లుగా ఏర్పాటు చేశారు. ఓటర్లు విధిగా అభ్యర్థికి కేటాయించిన పెట్టెల్లోనే ఓటు వేయాల్సి ఉండేది.

సంస్కరణలతో మార్పు

సంస్కరణల్లో భాగంగా 1962లో నిర్వహించిన ఎన్నికల్లో పోలింగ్ బూత్‌కు ఒక పెట్టె ఏర్పాటు చేశారు. బూత్‌లోని ఓట్ల సంఖ్య ఆధారంగా ఇనుప పెట్టెలను గోనె సంచుల్లో తీసుకుని వాహనాల్లో కేటాయించిన గ్రామాలకు వెళ్లేవారు. కాలక్రమేణా ఎలక్ట్రానిక్ యంత్రాల వినియోగం ఆరంభం కావడంతో ఓటింగ్‌లో సమూల మార్పులు చోటు చేసుకున్నాయి. ఓటింగ్‌లో అక్రమాలకు తెరపడింది. - వజ్రపుకొత్తూరు



అప్పటి ఓటింగ్ ఇనుప పెట్టె

• ఓటే వజ్రాయుధం



కవిటిలో మహిళల మానవహారం

2024 సమరం సన్నద్ధం

ప్రజాస్వామ్యంలో ఓటే బలమైన ఆయుధమని ఓటే నీ భవిష్యత్‌ను నిర్ణయిస్తుందని ఏపీఎం కె.గోవింద్ అన్నారు. కవిటి మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం ఓటు హక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ర్యాలీ, మానవహారం చేపట్టి ఓటు ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో సోషల్ మొబిలైజర్ సీహెచ్ మల్లేశ్వరరావు, వీవోఏలు, సిబ్బంది పాల్గొన్నారు. -కవిటి

• 19 రకాల అనుమతులు తప్పనిసరి

సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయబోయే అభ్యర్థులు బహిరంగ సభలు, మైక్‌లు తదితర 19 రకాల ప్రచార అనుమతుల కోసం ముందుగా దరఖాస్తు చేసుకోవాలని బూర్జ తహసీల్దార్ ఎస్.వి.అంబేడ్కర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి విధిగా పాటించాలని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా గానీ, ఆర్‌ఓను సంప్రదించి గానీ అనుమతులు పొందాలన్నారు. లేనిపక్షంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘనగా భావించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. -బూర్జ

ఎన్నికలం



• ఓటు నినాదం

మీరు వేసే ఓటు ప్రగతికి బాట
ప్రజా స్వామ్యానికి పూదోట
అరాచక శక్తులకు కాకూడదు రాచబాట

- ఆర్.ఢిల్లేశ్వరరావు, సారవకోట

• సరిహద్దులో ప్రత్యేక నిఘా



ఎన్నికల సిబ్బంది, పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సార్వత్రిక ఎన్నికల కోడ్ పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్ ఆదేశించారు. బుధవారం ఇచ్ఛాపురం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, కేంద్ర, రాష్ట్ర పోలీస్ బలగాల అధికారులతో మాట్లాడారు. ఎన్నికలకు సంబంధించి కంట్రోల్ రూం, ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు, జీపీఎస్ వాహనాలు హాజరైన సమయాలను, వెళ్లిన రూట్లు తదితర అంశాలపై నియోజకవర్గ ఎన్నికల అధికారి బి.సుదర్శన దొరను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఆంధ్రా - ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో నిఘా పెంచాలని, పురుషోత్తపురం చెక్‌పోస్టు వద్ద అధికారులు ప్రత్యేక దృష్టిని సారించి వాహనాలను తనిఖీ చేయాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం పోలీస్ బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్పీ నాగేశ్వరరావురెడ్డి, తహసీల్దార్ ఎం.భాస్కర అప్పారావు, సీఐ టి.ఇమ్మాన్యుయేల్ రాజు, ఎన్నికల ఉప తహసీల్దార్ బి.శ్రీహరి, రూరల్, టౌన్ ఎస్ఐలు లక్ష్మణరావు, సత్యనారాయణ పాల్గొన్నారు. -ఇచ్ఛాపురం రూరల్

• అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును తనిఖీ చేసిన ఎస్పీలు

రాబోయే ఆంధ్రప్రదేశ్, ఒడిశా అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక నిఘా కొనసాగించాలని శ్రీకాకుళం ఎస్పీ జీఆర్ రాధిక, గజపతి జిల్లా (ఒడిశా) ఎస్పీ శ్వేత కుమారి అన్నారు. పాతపట్నం సరిహద్దులోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికల దృష్ట్యా రాష్ట్ర సరిహద్దులో చెక్‌పోస్టుల వద్ద ఇరు రాష్ట్రాల పోలీసులు సహకరించుకోవాలన్నారు. మద్యం, డబ్బు, ఇతర నిషేధిత వస్తువులు అక్రమ రవాణా జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల రవాణా నియంత్రణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, నేరస్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పాతపట్నం, గజపతి పోలీసులు సమాచార వ్యవస్థను సమన్వయం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టెక్కలి డీఎస్పీ బాలచంద్ర రెడ్డి, గజపతి జిల్లా (ఒడిశా) డీఎస్పీ మాధవనందన్ నాయక్, పాతపట్నం సీఐ నల్లి సాయి, పర్లాకిమిడి సీఐ(ఐఐసీ) ప్రశాంత్ కుమార్ భూపతి, ఎస్ఐ మహమ్మద్ యాసీన్ పాల్గొన్నారు. -పాతపట్నం



అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద భద్రతపై చర్చిస్తున్న ఎస్పీలు జీఆర్ రాధిక, శ్వేతకుమారి

• ఏఓబీపై ప్రత్యేక దృష్టి



వాహనాలను తనిఖీ చేస్తున్న అడిషనల్ ఎస్పీ ప్రేమ్‌కాజల్

మెళియాపుట్టి: ఒడిశా నుంచి ఆంధ్రాలో ప్రవేశిస్తున్న ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని అడిషనల్ ఎస్పీ ప్రేమ్‌కాజల్ పోలీసులకు సూచించారు. బుధవారం ఏఓబీ సరిహద్దుల్లోని గొప్పిలి చెక్‌పోస్టును సందర్శించారు. పలు వాహనాలను తనిఖీచేశారు. మత్తు పదార్థాలు, మద్యం, ఇతరత్రా అక్రమ రవాణా జరగకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నగదు, పలు విలువైన వస్తువులు సైతం రవాణా చేసే అవకాశం ఉందని, వాహనాలను తనిఖీ చేసే సందర్భంలో నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. తనిఖీల్లో ఎస్సై టి.రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎన్నికల సామగ్రి కేంద్రం పరిశీలన



పంపిణీ కేంద్రం వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సోంపేట: రానున్న శాసనసభ, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ బుధవారం పరిశీలించారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేశారు. కేంద్రం వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నియోజకవర్గ ఆర్‌ఓ సుదర్శన్ దొరను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సామగ్రి పంపిణీలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ విజయ్‌కుమార్, ఇచ్ఛాపురం తహసీల్దార్ భాస్కరరావు, ఎంపీడీఓ రామారావు, పంచాయతీ ఈఓ వరప్రసాద్, ఎస్‌ఐ హైమావతి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాలుడి ఊరేగింపు



స్వామివారిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

మెళియాపుట్టి : మండల కేంద్రం మెళియాపుట్టిలో ఈ నెల 24న డోలోత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో బుధవారం రాధాగోవింద స్వామి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు సత్యనారాయణ రథో మాట్లాడుతూ ప్రతి రోజూ సాయంత్రం రాధాగోవింద స్వామి వారిని పల్లకిలో ఉంచి పురవీధుల్లో ఊరేగిస్తామన్నారు. 24న కామదహనం (మఘ) కార్యక్రమాన్ని పర్లాఖిమిడి రాజవంశీయులతో నిర్వహించిన అనంతరం డోలోత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

జీవరాశులను కాపాడాలి



చిత్రలేఖన పోటీల్లో విద్యార్థులు

పాతపట్నం: అంతరించి పోతున్న పిచ్చుకల జాతిని సంరక్షించాలని, జీవరాశులను కాపాడాల్సి బాధ్యత అందరిపై ఉందని ప్రధానోపాధ్యాయుడు ఎస్.వైకుంఠరావు అన్నారు. బుధవారం పాతపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రపంచ పిచ్చుకల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ అడవులు అంతరించిపోవడం, సెల్ టవర్లు, వాతావరణ కాలుష్యం కారణంగా పిచ్చుకల జాతి రోజురోజుకు కనుమరుగవుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో సైన్స్ టీచర్ ఎన్.టి.రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వణికించిన వాన



రణస్థలం: తాళ్లవలసలో పరదాలతో మొక్కజొన్నను కప్పుతున్న రైతు



కాశీబుగ్గ పాత జాతీయ రహదారిలో పారుతున్న వరదనీరు



ఎల్.ఎన్.పేట: జంబాడ వద్ద నేలరాలిన మామిడి పిందెలు



ఎల్.ఎన్.పేట:లక్ష్మీనర్సుపేట వద్ద వర్షానికి తడిచిపోయిన మొక్కజొన్న కంకెలు

- పలుచోట్ల ఈదురుగాలులు, పిడుగులతో వర్షం
- నేలరాలిన మామిడి పిందెలు.. తడిచిన మొక్కజొన్న
- ఆందోళనలో రైతులు

ఎల్.ఎన్.పేట/నరసన్నపేట/రణస్థలం:

జిల్లాలో పలు ప్రాంతాల్లో బుధవారం కురిసిన అకాల వర్షం రైతులకు అపార నష్టం మిగిల్చింది. ఉదయం బలమైన ఈదురు గాలులతో పాటు కుండపోతగా వర్షం కురవడంతో మామిడి పిందెలు రాలిపోయాయని పలు గ్రామాలకు చెందిన తోటల రైతులు, కాపలాదారులు ఆందోళన చెందుతున్నారు. ఎల్.ఎన్.పేట, మిరియాపల్లి, దబ్బపాడు, వాడవలస, బసవరాజుపేట తదితర గ్రామాల్లో కోత దశకు చేరిన మొక్క జొన్న తడిచిపోవడంతో రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. తురకపేట కోనేరు వద్ద విద్యుత్ స్తంభం నేలకొరిగింది.నరసన్నపేట మండలం లోని తామరాపల్లి తదితర గ్రామాల్లో పిడుగులు పడటంతో పట్ట తుంబయ్యకు చెందిన ఎకరా వరి గడ్డికుప్ప దగ్ధమైంది. సమాచారం అందుకున్న నరసన్నపేటకు చెందిన అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పారు. విద్యుత్ స్తంభంపై పిడుగు పడటంతో వైర్లు తెగిపడ్డాయి. దీంతో పలు ఇళ్లలో ఫ్యాన్లు, లైట్లు, ఫ్రిజ్‌లు కాలిపోయాయి. అల్పపీడన ద్రోణి వల్ల పడుతున్న వర్షాలకు మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని రణస్థలం వ్యవసాయాధికారి అధికారి డి.విజయభాస్కర్ తెలిపారు. మరో రెండు రోజుల పాటు వాతావరణం ఇలాగే ఉంటుందని, కోసిన మొక్కజొన్నపై పరదాలు కప్పి సురక్షితంగా ఉంచుకోవాలని సూచించారు.



శ్రీకాకుళంలో మేఘావృతమైన ఆకాశం



కొత్తూరు: కొత్తూరులో ఈదురు గాలులు



ఎల్.ఎన్.పేట: తురకపేట కోనేరు వద్ద నేలకొరిగిన విద్యుత్ స్తంభం



జి.సిగడాం: పాగిరి-పెంట గ్రామ పరిధిలో నీటితో నిండిన రహదారి



మెళియాపుట్టి: కొసమాల వద్ద రోడ్డుకు అడ్డంగా వాలిన చెట్టు



ఇచ్ఛాపురం రూరల్: ఇటుకబట్టీలో చేరిన నీటిని తొలగిస్తున్న కార్మికుడు



నరసన్నపేట: కాలిపోతున్న వరి గడ్డి కుప్ప

మార్చురీకని తీసుకెళ్లి..
ప్రాణం పోశారు!



డొక్కారి పూర్ణను పరదాలో మూటకట్టిన దృశ్యం

- రైలు పట్టాలపై అచేతనంగా వృద్ధుడు
- మృతి చెందాడనుకుని ఆస్పత్రి మార్చురీ గదికి తరలింపు
- బతికే ఉన్నట్లు గుర్తించి చికిత్స అందించిన వైద్యులు



మృతదేహమని భావించి తరలిస్తున్న జీఆర్‌పీ, ప్రైవేటు సిబ్బంది

కాశీబుగ్గ : ఒకటా..రెండా.. పదుల సంఖ్యలో రైళ్లు ఆ వృద్ధుడి మీదుగానే రాకపోకలు సాగించాయి. అలాంటి పరిస్థితుల్లో మృత్యువును జయించి మృత్యుంజయుడిగా నిలిచాడో వృద్ధుడు. వివరాల్లోకి వెళ్తే.. పలాస రైల్వేస్టేషన్‌లో రైలు పట్టాలపై గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం ఉందని పలాస జీఆర్‌పీ పోలీసులకు బుధవారం వేకువజామున సమాచారం అందింది. ఎవరు.. ఎలా మరణించారనే కారణాలు తెలియకపోయినప్పటికీ శాఖాపరంగా ఫొటోలు తీయడం, వివరాలు ఆరా తీయడం తదితర అంశాల రీత్యా పట్టాల మధ్యనే మృతదేహాన్ని ఉండనిచ్చారు. అనేక రైళ్లు ఆయన పైనుంచే రాకపోకలు సాగించాయి. ఆ తర్వాత వృద్ధుడ్ని తాళ్లతో మూటగా కట్టేశారు. రైలు పట్టాలపై మృతదేహం ఉందని, పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలోని మార్చురీకి తరలించాలని ఉదయం 9.30 గంటల సమయంలో పలాస 108 అంబులెన్సుకు రైల్వేస్టేషన్ నుంచి ఫోన్‌కాల్ వెళ్లింది. వెంటనే సిబ్బంది వచ్చి వృద్ధుడ్ని స్ట్రెచ్చర్‌పై 108 వాహనం ద్వారా ఆస్పత్రికి తీసుకెళ్లారు. నిబంధనల ప్రకారం తొలుత మృతదేహం అని నిర్ధారించడానికి చిన్నపాటి పరీక్షలు చేపడతారు. దీనిలో భాగంగా ఆస్పత్రి అత్యవసర విభాగంలో బుధవారం ఉదయం షిఫ్ట్‌లో ఉన్న డ్యూటీ డాక్టర్ ఉంగ కిరణ్‌కుమార్, సిబ్బంది నిశితంగా పరిశీలించారు. పల్స్ చిన్నగా కొట్టుకోవడం, కొన ఊపిరి ఉన్నట్లు గుర్తించి హుటాహుటిన కృత్రిమ ఆక్సిజన్ అందించి అవసరమైన ఇంజక్షన్, సెలైన్ బాటిల్ ఎక్కించారు. డాక్టర్ శరత్, డాక్టర్ సురేష్, స్టాఫ్‌నర్సు శ్రీదేవి, అశ్వినిలతో పాటు ఇతర సిబ్బంది అరగంట పాటు శ్రమించగా ఊపిరి తిరిగొచ్చింది. స్పృహలోకి వచ్చిన అనంతరం వివరాలు ఆరా తీయగా.. తన పేరు డొక్కారి పూర్ణ(58) అని, ఒడిశా రాష్ట్రం కటక్ సమీపంలోని డొక్కారి గ్రామానికి చెందినవాడినని చెప్పాడు. పూర్తిగా తేరుకున్నాక ఘటన వివరాలు రాబడతామని వైద్యులు తెలిపారు.



స్పృహలోకి వచ్చిన డొక్కారి పూర్ణ

వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేద్దాం



మంత్రి ధర్మానను కలిసిన ఎస్సీసెల్ విభాగం నాయకులు

శ్రీకాకుళం రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బాధ్యతగా పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సమష్టిగా కృషి చేయాలని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నూతనంగా ఎన్నికైన శ్రీకాకుళం నగర ఎస్సీసెల్ విభాగ ప్రతినిధులు బుధవారం పెదపాడులోని క్యాంపు కార్యాలయంలో మంత్రి ధర్మానను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం నిస్వార్థంగా పని చేసిన వారికి పదవులు తప్పక వస్తాయన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. బడుగు బలహీన వర్గాలకు అన్ని విధాలా ఆదుకున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ అధ్యక్షుడు పొన్నాడ రుషి, నాయకులు పాల్గొన్నారు.

కళ్లను జాగ్రత్తగా కాపాడుకుందాం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: శరీరంలోని ముఖ్యమైన అవయవాల్లో కళ్లు ప్రధానమైనవని, వీటిని ప్రతిఒక్కరూ జాగ్రత్తగా కాపాడుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా బార్ అసోసియేషన్ నూతన భవనంలో ఐ ఎక్స్ ప్రెస్ సంస్థ ఆధ్వర్యంలో న్యాయవాదులకు ఏర్పాటు చేసిన ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీవీలు, స్మార్ట్ ఫోన్లు వంటివి అధికంగా ఉపయోగించడం వల్ల కంటిలో శుక్లాలు దెబ్బతింటున్నాయని, చిన్నారులను సాధ్యమైనంత వరకు స్మార్ట్‌ఫోన్లకు దూరంగా ఉంచాలని చెప్పారు. కంటి సమస్యలు వచ్చిన వెంటనే సొంత వైద్యం చేయకుండా వైద్యులను సంప్రదించి తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం న్యాయవాదులకు దినేష్ కంటి ఆసుపత్రి నిపుణుడు డాక్టర్ దినేష్ కళ్ల పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ ఆపద్ధర్మ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు, ఉపాధ్యక్షుడు గొంటి చంద్ర మౌళి, జ్యోతిర్మయి, సీనియర్ న్యాయవాదులు కద్దాల శ్యాంసుందరరావు, చౌదరి లక్ష్మణరావు, కె.వేణుగోపాల్, పాడి సీతంనాయుడు, బెజ్జిపురపు ఫల్గుణరావు, జల్లు తిరుపతిరావు, పాలిశెట్టి మల్లిబాబు, నిహార్‌నాయుడు, సంస్థ మేనేజర్లు మజ్జి సుమన్, లక్ష్మణరావు, మజ్జి స్వాతి, సాయికుమార్ వెంకటేష్, జయరాం తదితరులు పాల్గొన్నారు.

గ్లకోమాపై అవగాహన అవసరం



గ్లకోమా క్యూఆర్ కోడ్ ప్రత్యేక స్టాంప్ పత్రాన్ని విడుదల చేస్తున్న ప్రొఫెసర్ వీణాబెన్ స్వరూప్, వీసీ రజిని, అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్:

కంటిచూపుపై ప్రభావం చూపే ప్రతి ఒక్కరికీ గ్లకోమా వ్యాధిపై అవగాహన అవసరమని విశాఖకు చెందిన వైద్య విభాగం ప్రొఫెసర్ సి.వీణాబెన్ స్వరూప్ అన్నారు. ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో బుధవారం గ్లకోమా వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గ్లాకోమా వ్యాధి వల్ల కంటి చూపు తగ్గుతుందని, నిర్లక్ష్యం చేస్తే చూపు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. 40 ఏళ్లు దాటిన వారికి ఈ సమస్య ఎక్కువగా వస్తుందని, వ్యాధి బారిన పడితే వెంటనే నేత్ర వైద్యులను సంప్రదించాలని సూచించారు. అనంతరం గ్లకోమా క్యూఆర్ కోడ్ ప్రత్యేక స్టాంప్ పత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ కె.ఆర్.రజిని, రిజిస్ట్రార్ పి.సుజాత, రెక్టార్ బి.అడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ అదృశ్యం



వెంకట శ్యామ్ కుమార్

నరసన్నపేట: మండలంలోని కొత్తపోలవలస సర్పంచ్ ఐ.వెంకట శ్యామ్‌కుమార్ (శ్యామ్ బాబు) బుధవారం ఉదయం నుంచి కనిపించడంలేదని భార్య ప్రశాంతి నరసన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆత్మహత్య చేసుకుంటున్నట్లు వేకువజామున ఇంట్లో లెటర్ పెట్టి ద్విచక్ర వాహనంపై వెళ్లిపోయినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. పలుచోట్ల వెతికినా కనిపించకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా, ఆర్థిక లావాదేవీల కారణంగానే శ్యామ్‌కుమార్ వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. కేసు నమోదు చేశామని, ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నామని ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపారు.

అప్‌డేట్‌కు సహకరించండి

శ్రీకాకుళం : ఏపీ ఎస్ఎఫ్ఎల్ నెట్‌వర్క్‌లోని అన్ని సెట్‌బాక్సులను సస్పెండ్ చేశామని, కొత్త అప్‌డేట్‌కు సహకరించాలని ఏపీ స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్ జిల్లా మార్కెటింగ్ మేనేజర్ గౌతమ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత ఎల్ఎంఓలు, ఎంఎస్ఓలు వినియోగదారులకు తెలియజేయడంతో పాటు ఇమేజ్ వెర్షన్ అప్‌గ్రేడేషన్ సాంకేతిక సమస్యను పరిష్కరించడంలో సహకరించాలని పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించడానికి, సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించేందుకు 48 గంటల్లో అప్‌గ్రేడేషన్ పూర్తి చేస్తామని తెలిపారు.

• సతీపతుల ప్రచారం



తమ్మినాయుడుపేటలో వృద్ధుడ్ని ఆప్యాయంగా పలకరిస్తున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



అదపాకలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీమణి పరిమళ

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రచారాలు ఊపందుకుంటున్నాయి. గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు ప్రచారం నిర్వహిస్తున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఇంటింటికీ వెళ్లి తమనే గెలిపించాలంటూ ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొర్లె కిరణ్‌కుమార్, సతీమణి పరిమళతో కలిసి బుధవారం ఎచ్చెర్ల మండలం తమ్మినాయుడుపేట, లావేరు మండలం అదపాక పంచాయతీల్లో ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని కోరారు.

– ఎచ్చెర్ల క్యాంపస్/ఎచ్చెర్ల